సాక్షి మెదక్

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



కోదండ రామాలయానికి తరలివచ్చిన భక్తులు

ముక్కోటి శోభ



మెదక్ మున్సిపాలిటీ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని దేవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు వేకువజాము నుంచే ఆలయాల వద్ద క్యూ కట్టారు. వారి సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో ఆలయ అర్చకులు భాష్యం మధుసూదన్ చార్యులు, వెంకటేశ్వర స్వామి ఆలయంలో నరేంద్ర చార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కాగా, కోదండ రామాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని సీతారామచంద్రస్వామి, వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కోదండ రామాలయంలోని స్వామివారికి మాధవానంద సరస్వతీ స్వామి సైతం పూజలు చేశారు. పలు ఆలయ ప్రాంగణాలు భక్తి గీతాలతో మార్మోగింది. సాయంత్రం లక్ష పుష్పార్చన, సేవ భజన, సంగీత విభావరి, వేద ఆశీర్వాదం తదితర విశేష కార్యక్రమాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

టెండర్ల ద్వారా ఆదాయం రూ.2.36 కోట్లు



టెండర్ నిర్వహిస్తున్న ఆలయ ఉద్యోగి

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడుపాయల టెండర్ల ద్వారా మొత్తం రూ.2,36,11,000 ఆదాయం సమకూరిందని ఈఓ మోహన్ రెడ్డి, చైర్మన్ బాలాగౌడ్ తెలిపారు. రెండుసార్లు వాయిదా పడ్డ టెండర్లు ఎట్టకేలకు శనివారం ఖరారయ్యాయి. టెంకాయల వేలాన్ని రూ.1.11 కోట్లకు మెదక్‌కు చెందిన ధర్మకర్ లింగాజి దక్కించుకున్నారు. ఒడి బియ్యం పాటను రూ.86.50 లక్షలకు నాగ్సాన్‌పల్లికి చెందిన బి.నర్సింలుగౌడ్, పూజా సామగ్రి వేలాన్ని రూ.18.50 లక్షలకు నాగ్సాన్‌పల్లికి చెందిన తిరుపతి సొంతం చేసుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి టెంకాయల ద్వారా రూ.20 లక్షలు, పూజా సామగ్రిలో రూ.13.50లక్షల ఆదాయం తగ్గింది. ఒడి బియ్యం ద్వారా రూ.15 లక్షలు ఆదాయం అధికంగా వచ్చింది. ఇక ఎంటర్ టైన్‌మెంట్, తలనీలాల టెండర్లు కలుపుకొని మొత్తం రూ.2,36,11,000ల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు, ధర్మకర్తలు వెంకటేశం, మనోహర్, మోహన్‌రావు, శ్రీనివాస్‌రావు , పెంటయ్య, సాయిలు, కిషన్, యాదయ్య, బాగారెడ్డి, చక్రపాణి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు పూజలు



పడిపూజలో మాజీ మంత్రి హరీశ్‌రావు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లో అయ్యప్ప మాలధారుడు కనిగిరి రవికుమార్ ఏర్పాటు చేసిన పడి పూజ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాఘవేందర్‌గౌడ్, ఎంపీపీ పురం నవనీతరవి, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు నత్తి మల్లేష్, మహిపాల్‌రెడ్డి, నాయకులు వెంకట్‌గౌడ్, ఉప సర్పంచ్ తుమ్మల రాజుయాదవ్, గురుస్వాములు ప్రభాకర్‌గౌడ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నర్సాపూర్: అందరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత అన్నారు. శనివారం స్థానిక మండల లీగల్ సర్వీస్ కమిటీ ఏర్పాటు చేసిన ఉచిత లోక్ అదాలత్, న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. కక్షిదారులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. అందరూ కలిసిమెలిసి జీవించాలని హితవు పలికారు. స్థిరాస్తులు కొనుగోలు చేసే సమయంలో ముందు ఎలాంటి తగాదాలు తలెత్తకుండా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పలు కేసులకు పరిష్కారం చూపారు. సదస్సులో కౌడిపల్లి డిప్యూటీ తహసీల్దార్ తారాబాయి, న్యాయవాదులు స్వరూపరాణి, రవినాయక్, శ్రీనివాస్, కౌడిపల్లి ఇరిగేషన్ ఏఈ రవిమోహన్, ఇతర సిబ్బంది, ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలు అందజేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

మెదక్ కలెక్టరేట్: మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశ పెట్టడం ద్వారా తాము ఉపాధిని కోల్పోయామని, ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలని ఆటోడ్రైవర్లు కోరారు. శనివారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలో నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. అక్కడ డీఈఓ పద్మశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి ఆటో కార్మికుడికి బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలన్నారు. కుటుంబ పోషణకు నెలకు రూ.15వేలు జీవనభృతి ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు భారీ ఎత్తున పాల్గొన్నారు.

సీఎస్‌ఐ@99

1924లో చర్చి నిర్మాణం

- ఈనెల 25వ తేదీ నాటికి 98 ఏళ్లు పూర్తి
- ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చర్చిగా ఖ్యాతి
- మెతకుసీమలో పనికి ఆహారానికి చిహ్నం
- ఆహ్లాద వాతావరణానికి కేరాఫ్ అడ్రస్‌గా గుర్తింపు

మెదక్ సీఎస్‌ఆర్ (చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) ప్రపంచ ప్రఖ్యాతిని గాంచింది. చార్లెస్ వాకర్ ఫాస్నెట్ దీనిని నిర్మించారు. ఈ చర్చి నిర్మాణ సమయంలో మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా మెదక్‌లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. పనికి ఆహారం పథకాన్ని ప్రవేశపెట్టి చర్చి నిర్మాణంలో పాలుపంచుకున్న వారికి భోజన ఏర్పాట్లు చేశారు. అలా పదేళ్ల పాటు సాగి 1924 డిసెంబర్ 25న పూర్తయింది. ఈ 2023 డిసెంబర్ 25న 99వ యేడులోకి అడుగుపెడుతోంది. ఈ క్రిస్మస్ పండగకు ముస్తాబు అవుతోంది. ఇది వాటికన్ సిటీ తర్వాత ప్రపంచంలోనే రెండో అతి పెద్ద చర్చిగా ప్రత్యేక గుర్తింపు పొందింది. దీనిపై కథనం..



విద్యుత్ అలంకరణలో జిగేల్ మంటున్న మెదక్ చర్చి

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతి గావించిన మెదక్ సీఎస్‌ఐ చర్చి పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది. ఈ అద్భుత కట్టడాలను కనులారా చూసి తరించాల్సిందే. రోజ్‌వుడ్ కలప, స్పెయిన్ గ్లాస్‌పై కరుణామయుడి జీవన వృత్తాంతం, అద్భుతమైన రాతికట్టడమే ఈ కోవెల ప్రత్యేకం. ఇలా అన్నీ అద్భుతాలే. ఈ అందాల కోవెలను చూసి తనివితీరాల్సిందే.

ఆకలితీర్చిన ఆలయం

అది మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయం. అగ్రరాజ్యాల ఆధిపత్య పోరులో సమిధలైన జనం అనేకం. అప్పుడు మన దేశంలోనూ దుర్భర పరిస్థితులున్నాయి. పనిలేక బతుకుదెరువు కరువై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ పక్కటెముకలు కనిపించేలా ఘోర కరువు రక్కసి కోరలకు చిక్కి ప్రజలు విలవిలలాడారు. ఆదుకునే వారు ఎవరైన రాకపోతారా? అని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న వేళ.. తమ ముందే ఎంతో మంది ఆకలి చావులతో మరణిస్తుంటే.. ఏడ్చే ఓపిక కూడా లేక ఆపన్న హస్తం కోసం ఆకాశానికేసి చూడటం తప్పితే, మరేమీ తెలియని దయనీయ స్థితిలో ఉన్న తరుణమది.

అపురూపం ఈ సుందర కట్టడం

ఈ చారిత్రక కట్టడానికి సంబంధించిన చర్చి గోపురం ఎత్తు 175 అడుగులు. పొడువు 200 అడుగులు, వెడల్పు 100 అడుగులు. మూడు గవాక్షములు, పలు రంగుటద్దాలతో ప్రతిష్ఠింపజేశారు. తూర్పున ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతం. పడమర క్రీస్తును శిలువేసిన దృశ్యం. ఉత్తరాన ఆయన చనిపోయి 3వ రోజు సజీవుడై ఆరోహనమైన దృశ్యాలు కనిపిస్తాయి. వాటిని సిద్ధం చేసిన చిత్రకారులు ఇంగ్లాండ్ దేశానికి చెందిన ఫ్రాంకోట, సాలిస్‌బరి. పై మూడు దృశ్యాలు పగలు మాత్రమే కనిపించడం ఒక ప్రత్యేకత. కేవలం సూర్యకాంతితోనే ఈ మూడు దృశ్యాలు కనిపిస్తా యి. వీటికోసం ప్రత్యేకంగా ప్రతి అద్దానికి మధ్యలో తగరాన్ని ఘనస్థితి నుంచి ద్రవస్థితిలోకి తీసుకొచ్చి, గ్లాస్‌కు మధ్యలో అమర్చి ఉంచారు. దీనిని బట్టే తెలుస్తుంది ఈ మహనీయుల కృషి. దేవాలయ పైకప్పు లోపలి భాగం ప్రతిష్ఠించిన మూడేళ్ల వరకు ప్రతిధ్వనించేదని చెబుతుంటారు. ఈ మహాదేవాలయం ప్రతిధ్వనించకుండా 1927లో గోళాకారంలో ఉన్న లోపలిభాగాన్ని రబ్బర్, కాటన్, మరికొన్ని రసాయనాలను ఉపయోగించి చర్చి ప్రతిధ్వనించకుండా చేశారు ఇంగ్లాండ్ ఇంజినీర్లు బాడ్షా, గ్యాస్‌హోప్. ఈ చారిత్రాత్మక కట్టడం ఆసియా ఖండంలోనే విస్తీర్ణంలో పెద్దది. కాగా దేవాలయ వ్యవస్థాపకుడు ఇంగ్లాండ్‌కు చెందిన రన్‌కోన్ పట్టణ వాసి రెవరెండ్ చార్లెస్ వాకర్ ఫాస్నెట్. చారిత్రక కట్టడాల్లో సుందర కట్టడంగా పేరొందిన మెదక్ కెథడ్రల్ చర్చి ఎందరో మహానుభావుల ఆర్కిటిక్ పనితనంతో ఇంకా నిత్య నూతనంగా విరాజిల్లుతోంది. ప్రత్యేకంగా క్రిస్మస్ పండగ సందర్భంగా చేసే అలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోనుంది.

చారిత్రక కట్టడానికి పునాది

మెతుకుసీమ ప్రజల దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయాడు చార్లెస్ వాకర్ ఫాస్నెట్. ఈ మహనీయుడి బృహత్తర ఆలోచనకు నిలువెత్తు నిదర్శనమే ఈ చారిత్రాత్మక కట్టడం. 1914లో పనికి ఆహారం పథకం పేరుతో ఆకలి చావులతో మెతుకుసీమ అల్లాడుతోంది. వాటిని ఆపడానికి గానూ యుద్ధ ప్రాతిపదికన ప్రజలకు ఉపాధి కల్పించే క్రమంలో భాగంగా ఈ చర్చి నిర్మాణానికి పునాది పడింది. సుమారు 10 ఏళ్లపాటు నిర్విరామంగా చర్చి నిర్మాణం సాగింది. 1924 డిసెంబర్ 25న క్రిస్మస్ రోజున ప్రారంభించబడింది. దీని నిర్మాణం వ్యయం అప్పట్లో సుమారు రూ.14 లక్షలు ఖర్చు జరిగినట్లు అంచనా.

స్పెషల్ సమ్మరీ రివిజన్

పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. లోకసభ ఎన్నికల కసరత్తులో భాగంగా శనివారం రాత్రి తన చాంబర్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై సమీక్ష నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024ను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. జనవరి 5వ తేదీ వరకు కొత్త ఓటర్లను నమోదు చేసి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని చెప్పారు. అదే నెల 22వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 2వ తేదీలోపు పరిష్కారం చేయాలని ఆదేశించారు. 8న తుది జాబితాను వెలువరించాలని తెలిపారు. శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని, కొత్త ఓటర్‌గా నమోదు చేసుకునే వారు ఫారం–6 దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఆఫ్, ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, ఆర్డీఓలు రాజేశ్వర్, శ్రీనివాస్, జయచంద్ర, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పొట్టగొట్టారు

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్: జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయించామని, 2024లో పనులు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో మెడికల్ కళాశాలతోపాటు స్పెషల్ గ్రాంట్ కింద జిల్లాకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. వాటితో డెవలప్‌మెంట్ చేయాలన్నారు. వాటి పట్ల నిర్లక్ష్యం చేస్తే ఎలాంటి పోరాటానికైనా తాము సిద్ధమని హెచ్చరించారు. ఇప్పటికే ఎంసీహెచ్ ఆస్పత్రిలో 25 శాతం మంది పారిశుద్ధ్య కార్మికులను తొలగించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఆస్పత్రిలో నెలకు సగటున 400 ప్రసవాలు జరుగుతాయని అక్కడ పరిశుభ్రత బాగుండాలని చెప్పారు. అభివృద్ధి చేస్తే తాము సహకరిస్తామని లేకుంటే పోరాటాలకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యరెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

హవేళీఘణాపూర్(మెదక్): బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ మండలం మగ్దూంపూర్ గ్రామానికి చెందిన జక్కుల యాదమ్మ, యాదగిరి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వీరికి పార్టీ సభ్యత్వం ఉండటంతో వారి కుటుంబసభ్యులకు రూ.2లక్షల చొప్పున రెండు చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మెదక్ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ రజనీకాంత్, గిరిధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బియ్యం స్కాంకు బాధ్యులెవరు?

- శాసన మండలిలో చర్చిస్తాం
- ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి ఆగ్రహం

మెదక్/మెదక్ కలెక్టరేట్: ప్రజాపంపిణీ ద్వారా పేదలకు అందించాల్సిన వేలాది క్వింటాళ్ల బియ్యంతో పాటు గన్నీ బస్తాలను మాయం చేసి కోట్లాది రూపాయల స్కాం చేసి జిల్లాకు చెడ్డ పేరు తెచ్చారని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని క్షమించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అధ్యక్షతన జెడ్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విషయాన్ని శాసనమండలి దృష్టికి తీసుకెళ్లి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఎంఎల్‌సీ పాయింట్ల నుంచి వేలాది క్వింటాళ్ల బియ్యం, గన్నీ బస్తాల స్కాం ఎలా జరిగిందని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ మాట్లాడుతూ, జిల్లాలోని రామాయంపేట, చేగుంట, మెదక్, తూప్రాన్ ఎంఎల్‌ఎస్ గోదాముల్లో 8 వేల క్వింటాళ్ల బియ్యంతోపాటు అదనంగా మెదక్ గోదాములో రూ. 3.60 లక్షల గోనె సంచుల స్కాం జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఇందుకు కారణమైన గోదాం ఇన్‌చార్జులను సస్పెండ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు పెట్టినట్లు చెప్పారు. అనంతరం రైతుబంధు డబ్బులు రైతులకు ఎప్పుడిస్తారని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోవింద్ స్పందిస్తూ, సాంకేతిక సమస్య కారణంగా ఆలస్యమైనట్లు తెలిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఎన్నిగంటలు ఇస్తారో స్పష్టం చేయాలని, ఈ విషయంలో రైతులు ఆందోళనకు గురవుతున్నట్లు చేగుంట ఎంపీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఎస్‌ఈ జానకీరాం మాట్లాడుతూ గతంలో మాదిరిగానే సరఫరా చేస్తామని తెలిపారు. మండలంలోని మల్లంపేట పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు విద్య అందడం లేదని పాపన్నపేట ఎంపీపీ చందన వాపోయారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేసినా తమకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు హెచ్‌ఈఓ శ్రీనివాస్ తెలిపారు. అంతకు ముందు లావణ్యరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ జిల్లాకు మంజూరు చేసిన అభివృద్ధి నిధులను వెనక్కి పంపకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సభలో ప్రతిపాదించారు. దీనిని వెల్దుర్తి జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ బలపర్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అదనపు కలెక్టర్ రమేశ్, జెడ్పీసీఈఓ శైలేష్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి తదితరులు



హాజరైన సభ్యులు

అభివృద్ధికి సై.. పచ్చదనం నై !




పచ్చదనం నిండిన రామాయంపేట, మెదక్ అటవీ ప్రాంతం



బోసిపోయిన మెదక్-రామాయంపేట రోడ్డు

రామాయంపేట(మెదక్): అభివృద్ధి జరగడం అందరికీ ముఖ్యమే. అలాగని పచ్చదనాన్ని హరించి వేయడం సరికాదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితమే మెదక్ నుంచి సిద్దిపేట వరకు కొత్త జాతీయ రహదారి (765 డీజీ) నిర్మాణానికి గాను కేంద్రం రూ. 882 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు చకచకా కొనసాగుతున్నాయి. రోడ్డు పక్కనున్న ఏళ్ల నాటి పెద్ద చెట్లను కూకటివేళ్లతో సహా పెకిలిస్తున్నారు. కానీ మరోచోట నాటేందుకు గాను ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. విస్తరణ భాగంగా రామాయంపేట మండల పరిధిలోని అటవీ ప్రాంతం వరకు చెట్లు తొలగించకుండా విడిచిపెట్టారు. అనుమతులు వస్తే వాటిని తొలగిస్తామని కంట్రాక్టర్లు పేర్కొన్నారు. ఇప్పటికే మెదక్, రామాయంపేట మధ్య రోడ్డు పక్కన ఉన్న చెట్లను నరికివేశారు. దీంతో రహదారి బోసిపోయింది.



క్రిస్మస్ పండగ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పెద్దశంకరంపేట, కౌడిపల్లిలోని పలు ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. మూడు రోజుల పాటు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. - పెద్దశంకరంపేట(మెదక్)/ కౌడిపల్లి

వరి గడ్డి.. కడుపు నింపుతోంది

క్లుప్తంగా

సౌత్‌ఈస్ట్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

చేగుంట(తూప్రాన్): సౌత్‌ఈస్ట్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ కరణం గణేశ్ రవికుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్‌టీయూ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ప్రతిభను కనబర్చినట్లు పేర్కొన్నారు. పాయిల్ విభాగంలో కరణం నిషాంత్, ఈపీ విభాగంలో ముఖేశ్, శ్రీకాంత్, సాబేర్ విభాగంలో జవదుద్దీన్ విజేతలుగా నిలిచినట్లు పేర్కొన్నారు. వీరంతా ఈనెల 24 నుంచి మహారాష్ట్ర ఔరంగాబాద్‌లో జరిగే సౌత్‌ఈస్ట్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని కోచ్ పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



పీఈటీ రాములుతో రమావత్ సోనా

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని రమావత్ సోనా జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం రాంమోహన్‌రావు శనివారం తెలిపారు. కొమురం భీమ్ జిల్లా ఆసిఫాబాద్‌లో ఈ నెల 20 నుంచి 22 తేదీ వరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. అండర్ 14 బాలికల విభాగం ఖోఖో పోటీల్లో రమావత్ సోనా, జన్ముల వర్ష ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రమావత్ సోనా రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో సోనా పాల్గొననుంది. సోనా, పీఈటీ రాములును హెచ్‌ఎం, టీచర్లు అభినందించారు.

మాజీ సైనికులు సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి టౌన్: మాజీ సైనికులు స్వయం ఉపాధి పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఎస్.సత్య శ్రీ అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో మాజీ సైనికుల ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు స్వయం ఉపాధి పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. వారికి లభించే రాయితీలన్నీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని పొందాలన్నారు. వెల్డింగ్ టెస్ట్‌లోని మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ నుంచి వచ్చిన అధికారులు పలు అంశాలను వివరించారు.

వరి గడ్డి.. కడుపు నింపుతోంది

పశుగ్రాసమే వారికి వ్యాపారం

- జీవనోపాధి పొందుతున్న మెదక్ జిల్లా అప్పాజిపల్లి వాసులు
- గ్రామాల్లో కొని హైదరాబాద్‌కు తరలింపు
- రైతులకు ఆదాయంతోపాటు కూలీలకు ఉపాధి

బతుకుబాటలో ఒక్కొక్కరిదీ ఒక్కో దారి.. ఆ దారిలోనే మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామస్తులు గడ్డిపోచలనే తమ జీవనాధారంగా మార్చుకున్నారు. మూడు దశాబ్దాలకు పైగా ఇదే వారికి ఉపాధి చూపుతోంది. హార్వెస్టర్ల రాకతో కొంతమేర వ్యాపారంపై ప్రభావం పడినా, కొన్ని ఒడిదొడుకులు వచ్చినా.. ఎండు గడ్డి వ్యాపారంలో ముందుకు సాగుతున్న ఆ గ్రామవాసులపై ప్రత్యేక కథనం.

-సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలతోపాటు, సమీపంలో ఉన్న కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల పరిధిలో వరి ఎక్కువగా పండించే గ్రామాలకు వెళ్లి అప్పాజిపల్లివాసులు గడ్డి కొనుగోలు చేస్తారు. సొంత వాహనాలను స్వయంగా నడుపుకుంటూ వెళ్లి గడ్డి తీసుకొస్తారు. ఉదయం 6 గంటలకే ఆయా గ్రామాలకు వెళ్లి గడ్డి లోడ్ చేసుకొని మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంటికి చేరుకుంటారు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారు. గడ్డిని విక్రయించి అన్‌లోడ్ చేసి, తిరిగి అదే రాత్రి ఇంటికి చేరుకుంటారు.

సీజన్‌లో రోజుకు 20 లారీలు

ఖరీఫ్, రబీ వరికోతల నుంచి సీజన్ మొదలవుతుంది. ఖరీఫ్‌లో ఎండు గడ్డి వ్యాపారం నవంబర్ నుంచి జనవరి వరకు, రబీలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉంటుంది. ఆయా సీజన్లలో రోజు 20 లారీల్లో గడ్డిని హైదరాబాద్ తరలిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. మేతకే కాకుండా.. ఇతర అవసరాలకు కూడా గడ్డిని వాడుతుంటారు. గాజు వస్తువులు ప్యాకింగ్ చేసేందుకు ఈ గడ్డిని ఎక్కువగా వాడుతారు. పండ్లు ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు వినియోగిస్తారు. గోశాలలు, గుర్రాలకు మేత కోసం కూడా గడ్డిని విక్రయిస్తారు.

రైతుకు ఆదాయం.. కూలీకి ఉపాధి

గడ్డిని పశుగ్రాసంగా వినియోగించే రైతుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుముఖం పట్టింది. వ్యవసాయ పనుల్లో పశువులు వాడకపోవడమే దీనికి ప్రధాన కారణం. చాలా చోట్ల రైతులు వరి కోతల అనంతరం గడ్డిని కాల్చేస్తున్నారు. ఇలా వృథా అయ్యే గడ్డిని వ్యాపారులకు విక్రయించడం ద్వారా రైతుకు ఎకరానికి రూ.2,000 వరకు ఆదాయం వస్తుంది. ఎకరానికి 50 నుంచి 60 కట్టల గడ్డి వస్తుంది. ఈ గడ్డి కట్టలు కట్టే కూలీలకు కూడా కట్టకు రూ.20 చొప్పున చెల్లిస్తారు. వరికోత యంత్రాల రాకతో పశువులున్న రైతులే గడ్డిని వినియోగిస్తుండగా, మిగితా రైతులు ఈ గడ్డిపై ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. దీంతో తమకు గిరాకీ తగ్గిపోతుందని గడ్డి వ్యాపారం చేసే అప్పాజిపల్లివాసులు చెబుతున్నారు.



హైదరాబాద్‌కు తరలించేందుకు లారీలో గడ్డి లోడ్ చేస్తున్న వ్యాపారులు



డీసీఎంలో గడ్డి తీసుకెళ్తున్న దృశ్యం



అప్పాజిపల్లి గ్రామం

గిరాకీ బాగా తగ్గింది



చాలా ఏళ్లుగా ఈ వ్యాపారం చేస్తున్నాను. బాన్సువాడ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో గడ్డి కొని హైదరాబాద్ తీసుకెళ్తాం. గతంతో పోల్చితే ఇప్పుడు గిరాకీ లేదు. పశువుల పెంపకం తగ్గిపోవడంతో గతంలో ఉన్నంత డిమాండ్ ఇప్పుడు ఉండడం లేదు. ఒక్కోసారి ఆర్డర్ లేకపోతే వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం.

-కన్నెబోయిన వెంకటేశం, గడ్డి వ్యాపారి, అప్పాజిపల్లి

మిషన్ల రాకతో దొరకడం లేదు..



వరికోత మిషన్ల రాకతో గడ్డి సరిగా దొరడం లేదు. కూలీలతో వరి కోస్తే గడ్డి మంచిగా వస్తుంది. హైదరాబాద్ నుంచి ఆర్డర్లు కూడా తగ్గుతున్నాయి. ఊర్లలో ఒకరిద్దరు గడ్డి కోసం కొనుక్కున్న లారీలను కూడా అమ్మేసుకున్నారు. గడ్డి లోడింగ్, అన్ లోడింగ్‌కు కూలీలు దొరక్క గడ్డి దందాకు ఇబ్బందిగా మారింది.

-కే.శేఖరయ్య, గడ్డి వ్యాపారి, అప్పాజిపల్లి

కేంద్ర పథకాలు వివరించడానికే..



సమావేశంలో మాట్లాడుతున్న శాంతామణి

- వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర
- కేంద్ర అదనపు కార్యదర్శి శాంతామణి

పటాన్‌చెరుటౌన్: కేంద్ర గ్రామీణ పథకాలు ప్రజలకు వివరించి, అవగాహన కల్పించడమే 'వికసిత్ భారత్ సంకల్ప్' యాత్ర ముఖ్య ఉద్దేశమని కేంద్ర అదనపు కార్యదర్శి, వికసిత్ భారత్ సంకల్ప్ నోడల్ అధికారి శాంతామణి (ఐఏఎస్) అన్నారు. శనివారం మండలంలోని ఘనపూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి శాంతామణి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజలందరినీ భాగ్యస్వాములు చేస్తుందన్నారు. మహిళల ఆత్మ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని 10 కోట్ల మందికి మరుగుదొడ్లు మంజూరు చేసి అందుబాటులోకి తీసుకొని వచ్చారని తెలిపారు. దేశంలోని పేద ప్రజలకు జన్‌ధన్ యోజన పథకం ద్వారా బ్యాంకుల్లో సున్నా అకౌంట్ ఖాతాలు తెరిచి 50 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు తెరిచామన్నారు. ఉజ్వల గ్యాస్ పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, డీఎల్‌పీఓ సతీష్ రెడ్డి, ఎంపీఓ హరి శంకర్ గౌడ్, గ్రామ సర్పంచ్ కావ్య కాశిరెడ్డి, ఎంపీటీసీ నీనా చంద్రశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవ వనరులు దేశాభివృద్ధికి కీలకం

- డాక్టర్.హెచ్‌పీ సింగ్
- కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం 9వ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్‌పీ సింగ్

ములుగు(గజ్వేల్): మానవ వనరులు దేశాభివృద్ధికి కీలకమని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్. హెచ్‌పీ సింగ్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం 9వ ఆవిర్భావ దినోత్సవానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతోపాటు విషయ పరిజ్ఞానం తెలిస్తే రైతులు కీలక విజయాలు సాధిస్తారని తెలిపారు. రైతులు నికర ఆదాయాలు పొందేలా తోడ్పాటు అందించే విశ్వవిద్యాలయాలు, సంస్థలకు గుర్తింపు ఉంటుందన్నారు. రాజేంద్రనగర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్. ఆర్‌కె మాథుర్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంటల సాగుతో అధిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్. బి.నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఇప్పటివరకు నిర్వహించిన కార్యకలాపాలు, సాధించిన విజయాలను వివరించారు. అనంతరం యూనివర్సిటీ రూపొందించిన ఉద్యానదర్శిని మొబైల్ యాప్, ఉద్యాన పంటలకు సంబంధించి అన్ని పంటలపై సమగ్ర సమాచారంతో కూడిన ఈ ఉద్యానదర్శిని, పూలు, కూరగాయలపై రూపొందించిన బులెటిన్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యునివర్సిటీ అధికారులు భగవాన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌డీఎస్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా కుమార్



నారాయణఖేడ్: అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం (ఏఐఎఫ్‌డీఎస్) ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్‌గా నారాయణఖేడ్‌కు చెందిన తెంకటి కుమార్‌ను శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మురళీ, గడ్డం నాగార్జున ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఖేడ్‌లో సంఘం ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెంకటి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడూ ఎండగడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక



సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా యువజన ఉత్సవాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థినీలను ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి శనివారం అభినందించి, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందించారు. కళాశాలకు చెందిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని స్వాతి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. మరో విద్యార్థిని తరుణి పోస్టర్ ప్రజెంటేషన్‌లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం ఉత్తమ ప్రతిభ కనబర్చి కళాశాలకు గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, కనకచంద్రం, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, నగేశ్, రఘురాజ్, గంగాధర్, రాజ్యలక్ష్మి, రాజశేఖర్, కౌసర్, సత్యం, భాస్కర్, ఫాతిమా, వెంకటేశ్, నవనీత, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవి పందిని ఢీకొట్టిన కారు



ప్రమాద స్థలంలో బోల్తా పడిన కారు

- బోల్తా పడటంతో ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- షిర్డీ యాత్రకు వెళ్తున్న స్నేహితులు
- నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద ఘటన



ప్రమాదంలో మృతి చెందిన చంద్రశేఖర్

కల్హేర్(నారాయణఖేడ్): రోడ్డు అడ్డుగా వచ్చిన అడివి పందిని కారు ఢీకొట్టడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన ఐదుగురు స్నేహితులు దులపల్లి చంద్రశేఖర్(26), ఫణీందర్(27), చెన్నకేశవులు, బాల మల్లేశ్, కిషోర్‌కుమార్ కారులో షిర్డీకి బయల్దేరారు. బాచేపల్లి సమీపంలో అడవి పంది రోడ్డుకు అడ్డు రావడంతో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పల్టీలు కొట్టి బోల్తా పడటంతో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, దులపల్లి చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. నలుగురిని చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఫణీందర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన డీసీఎం..

తీవ్రగాయాలై అక్కడికక్కడే వ్యక్తి మృతి



సాయితేజ

పటాన్‌చెరు టౌన్: స్కూటీని డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని తిరుపతికి చెందిన సాయి తేజ(27) బతుకుదెరువు కోసం ఐడీపీఎల్ బాలానగర్‌కి వచ్చి పటాన్‌చెరు మండలం, పాశమైలారం పారిశ్రామిక వాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం పని ముగించుకొని పాశమైలారం నుంచి ఇస్నాపూర్ వైపు స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం వెనుక టైర్ల కింద సాయి తేజ పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శనివారం మృతుడి బావమరిది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌కు చీర చిక్కుకొని..

కిందపడటంతో గాయాలై మహిళ మృతి



భూక్య జుంక(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: బైక్‌పై వెళ్తుండగా వెనుక కూర్చున మహిళ చీర చిక్కుకొని కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం బల్లునాయక్ తండాకు చెందిన భూక్య జుంక(51) కుటుంబం బతుకుదెరువు కోసం కరీంనగర్‌కు వెళ్లి అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల కిందట స్వగ్రామం బల్లునాయక్ తండాకు వచ్చి పొలం పనులు చేసుకున్నారు. కూలీ పనికి వెళ్లాలని శనివారం తెల్లవారుజామున కుమారుడి బైక్‌పై కరీంనగర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్‌కు చీర చిక్కుకొని రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర అక్కడిక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

సెంట్రింగ్ బాక్స్‌లు తొలగిస్తూ..

మూడో అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: సెంట్రింగ్ బాక్స్‌లు తొలగిస్తూ ప్రమాదవశాత్తు మూడో అంతస్తు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన అశోక్ నదినే (45) బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఏడాది కిందట అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మీ కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారు. ఓ కన్‌స్ట్రక్షన్ వారి వద్ద కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం పనికి వెళ్లిన అశోక్ మూడో అంతస్తులో సెంట్రింగ్ బాక్స్‌లను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. సైట్ ఇన్‌చార్జి ఆర్‌కే మిశ్రా, సెంట్రింగ్ కాంట్రాక్టర్ మహేశ్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లే తన తండ్రి మృతి చెందాడని మృతుడి కుమారుడు ప్రకాశ్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ట్రైడెంట్' ఆస్తుల వేలం

- నోటీసులు జారీ చేసిన అధికారులు
- జనవరి 10న వేసేందుకు నిర్ణయం
- రైతులకు రూ.9 కోట్ల బకాయిలు
- వచ్చిన డబ్బుతో చెల్లింపు



జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం

జహీరాబాద్: గత సీజన్‌కు సంబంధించి ట్రైడెంట్ యాజమాన్యం చెరకు రైతులకు రూ.9 కోట్ల బకాయిలు చెల్లించే విషయంలో జాప్యం చేస్తుండడంతో కర్మాగారం ఆస్తుల వేలానికి అధికారులు నోటీసులు జారీ చేశారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ చక్కెర కర్మాగారం యాజమాన్యం రైతులకు చెరకు బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో రెవెన్యూ యాక్ట్ చట్టం అమలు చేసి, దీని ద్వారా కర్మాగారం ఆస్తులను వేలం వేయాలని, వచ్చిన డబ్బులతో రైతులకు బకాయిలు చెల్లించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 11వ తేదీన యాజమాన్యానికి తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. జనవరి 10వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు ఫారం నంబర్–7 ద్వారా నోటీసులో పేర్కొన్నారు. చెరకు రైతులకు పడిన బకాయిలను చెల్లించాలంటూ పలు మార్లు రెవెన్యూ, చెరకు అభివృద్ధి మండలి అధికారులు యాజమాన్యంపై వత్తిడి చేస్తూ వచ్చారు. ఇప్పటి వరకు ఏడు నోటీసులు జారీ చేస్తూ వచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. విధిలేని పరిస్థితుల్లో రెవెన్యూ యాక్ట్ చట్టం ఉపయోగించి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను ఇచ్చేందుకు గాను వేలం నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

రూ.9 కోట్ల బకాయిలు

'ట్రైడెంట్' కర్మాగారంలో 2022–23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి రూ.9 కోట్ల మేర చెరకు బిల్లులను యాజమాన్యం రైతులకు బకాయి పడింది. ఈ సీజన్‌లో 2.55 లక్షల టన్నుల చెరకును కర్మాగారంలో గానుగాడించారు. టన్నుకు రూ.3,270 ధర నిర్ణయించింది. మొదటి విడత కింద టన్నుకు రూ.3వేల వంతున చెల్లిస్తూ వచ్చారు. మిగతా రూ.270 పెండింగ్ పెట్టారు. జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మాసంలో చెరకును సరఫరా చేసిన రైతులకు మాత్రం పూర్తిస్థాయిలో బిల్లులు బకాయి పడింది. జోన్ పరిధిలో ఉన్న మొత్తం 2,287 మంది రైతులు కర్మాగారానికి చెరకును సరఫరా చేశారు. ఇందులో 1,699 మంది రైతులకు టన్నుకు రూ.270 వంతున బకాయి పడింది. మిగిలిన రైతులకు పూర్తిస్థాయిలో బిల్లులు బకాయి పడింది. రూ.83 కోట్లకు గాను రైతాంగానికి ఇప్పటి వరకు రూ.74 కోట్ల మేర బిల్లులు చెల్లించింది. ఇంకా రూ.9 కోట్ల మేర బకాయిలను చెల్లించాల్సి ఉందని రైతులు, అధికారులు పేర్కొన్నారు.